
# తల్లి ~ తండ్రి ~ గురువు ~ దైవం



పిల్లలూ! వేదాలు మనకు "మాతృదేవోభవ-పితృదేవోభవ-ఆచార్యదేవోభవ" అని తెలుపుతున్నాయి. కలియుగ దైవము భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు కూడా ఎల్లప్పుడూ "నీ తల్లిదండ్రులను సేవించు, ప్రేమించు, పూజించు, గౌరవించు"అంటూ వారి ఎడల మన బాధ్యతను గుర్తు చేస్తుంటారు.

**"పేరెంట్" అనగా "పే – రెంట్ "అని చెప్తూ మనము పేరెంట్స్ కి 'కృతజ్ఞత' అనే "రెంట్" చెల్లించవలసి ఉంటుంది అని చెప్తారు**. అలా తన ఆఖరి శ్వాస వరకు తన తల్లిదండ్రుల సేవయే తన జీవిత పరమావధిగా భావించిన వాడు "శ్రవణ కుమారుడు". మరి శ్రవణ కుమారుడు తన తల్లిదండ్రులను ఎలా సేవించాడో తెలుసుకుందామా?

కోసల దేశాన్ని దశరథ మహారాజు పరిపాలిస్తున్న కాలంలో" శ్రవణ కుమారుడు" అనే బాలుడు ఆయన రాజ్యంలో నివసించేవాడు. అతని తల్లిదండ్రులు ముసలివారు, గుడ్డివారు. శ్రవణుడికి తల్లిదండ్రులు అంటే అమితమైన ప్రేమాభిమానాలు, భక్తిశ్రద్ధలు ఉండేవి. నిరంతరం వారిని సేవించుటయే తన జీవిత పరమావధిగా భావించుచుండేవాడు. ఒకసారి అతని తల్లిదండ్రులు వారిని తీర్థయాత్రలను చేయించవలసిందిగా కోరారు. తల్లిదండ్రుల కోరికను అంగీకరించిన శ్రవణుడు తీర్థయాత్రలకు వెళ్లే ప్రయత్నాలను ప్రారంభించాడు.






అతనికి తెలిసిన వడ్రంగి (Carpenter) వద్దకు వెళ్లి, ఒక కావడి తయారు చేయించి, అందులో తన తల్లిదండ్రులను కూర్చుండబెట్టి, ఆ కావడిని తన భుజానికెత్తుకుని తీర్థయాత్రలను ప్రారంభించాడు. ఈ విధంగా శ్రవణుడు దీక్షతో, భక్తి శ్రద్ధలతో,తల్లిదండ్రులకు అనేక యాత్రాస్థలాలను చూపించసాగెను. ఇది చూసిన ప్రజలందరూ “తల్లిదండ్రుల యెడల  అతనికి కల భక్తి శ్రద్ధలను వేనోళ్ళ కొనియాడిరి”.



ఇలా ఉండగా ఒకరోజు రాత్రి వారు అడవికి దగ్గరగా కల, సత్రం యందు బసచేసిరి. ఆ సత్రంలో విశ్రాంతి తీసుకొనుచుండగా, అతని తల్లిదండ్రులు వారికి దాహంగా ఉన్నదని తెలపగా, శ్రవణుడు ఒక కుండను తీసుకుని నీటి కొరకై దగ్గరలో ఉన్న నదికి వెళ్లెను.

ఆ కుండ నీటిలో ముంచు చుండగా, ఎక్కడినుంచో ఒక బాణము రివ్వున వచ్చి శ్రవణుని గుండెలలో గుచ్చుకొనెను. ఆ బాణం వేసినది ఆదేశ మహారాజైన దశరధుడు.అతడు శ్రవణుడి కేక విని పరిగెత్తుకొని వచ్చి, అతని గుండెల్లో కుచ్చుకున్న బాణమును చూచి ఎంతోబాధపడెను.





అతన్ని చూసిన శ్రవణకుమారుడు, ప్రాణాపాయ స్థితిలో ఉండి కూడా "అయ్యా! ఇక్కడికి దగ్గరగా కల సత్రంలో నా తల్లిదండ్రులు దాహంతో బాధ పడుచున్నారు. మీరు వెంటనే వెళ్లి వారికి \ నీరు అందించండి" అంటూ ప్రాణాలు వదిలెను. అందుకే స్వామి ఇలా చెప్తారు:"ఏ ఋణాన్ని అయినా తీర్చుకోవచ్చు కానీ, తల్లిదండ్రుల ఋణాన్ని ఎన్నటికీ తీర్చుకోలేము. ఎందుకనగా మీ హెడ్డు, బ్లడ్డు, ఫుడ్డు, దుడ్డు (Money) అన్నీ మీకు మీ తల్లిదండ్రుల నుండి వచ్చినవే.

వారిని సంతోష పెట్టటమే మీ కర్తవ్యం . తన చివరి శ్వాస వరకు తల్లిదండ్రుల సేవయే తన జీవిత పరమార్థం గా భావించిన శ్రవణకుమారుని ఆదర్శాన్ని మీ హృదయంలో నిలుపు కొనుడు" అని.

తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి విద్యాబుద్ధులు నేర్చి, సత్ప్రవర్తన కలిగి ఉండుటకై గురువును చూపిస్తారు. గురువులను గౌరవించే సంప్రదాయం మన భారతీయులది.

గురువులు తమ శిష్యులలో సత్ప్రవర్తన అనే బీజములు నాటి, వారిని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడమే కాక, నిరంతరము వారిని సంరక్షించుటకై తాము శిక్ష అనుభవించుటకు కూడా వెనుకాడరు.





**అటువంటి వారిలో శివాజీ గురువైన సమర్థ రామదాసు గురించి తెలుసుకుందామా!**



సమర్థ రామదాసు ఒకసారి తన శిష్యులతో శివాజీ వద్దకు బయలుదేరాడు. బాల్యము నందు వాజీకి విద్యాబుద్ధులు నేర్పినందువలన, తరచుగా వెళ్ళి అతని యోగ క్షేమములను విచారించి, తగిన సలహాలను అందించేవాడు.


మార్గమధ్యంలో సమర్థ రామదాసు శిష్యులకు ఆకలి, దాహము కలుగుటచే, వారు దగ్గరలో వున్న ఒక చెరుకుతోటలో ప్రవేశించి, చెరుకు గడలను తినసాగిరి. అది చూచిన ఆ తోట యజమాని పరిగెత్తుకొని వచ్చి, ఒక కర్ర తీసుకుని ఆ శిష్యులను కొట్టి, వారిపై సమర్థ రామదాసుకు ఫిర్యాదు చేసెను. సమర్థ రామదాసు తన శిష్యులు చేసిన పనికి క్షమాపణలు కోరి, జిహ్వాచాపల్యం అరికట్టుకోలేని తన శిష్యులను మందలించెను. కొద్దిసేపటికి వారు శివాజీ భవనం చేరగా, శివాజీ స్వయంగా గురువుగారికి ఎదురేగి, పాదాభివందనం చేసి, సాధారంగా లోనికి ఆహ్వానించెను. గురువు గారికి తనే స్వయంగా



స్నానం చేయించవలెనని, స్నానాల గదిలోనికి తీసుకెళ్లెను. గురువుగారి వీపుమీద ఎర్రని చారలు, బొబ్బలు చూసి బాధతో" గురుదేవా! ఎవరు మిమ్మల్ని ఈ విధంగా కొట్టారు ?" అని ప్రశ్నించగా, గురువుగారు ఏమి సమాధానం చెప్పలేదు. తర్వాత శివాజీ శిష్యులను ఈ విషయం అడగగా, వారు సిగ్గుతో జరిగిన విషయం వివరించిరి.

తమ శిష్యులను రక్షించే నిమిత్తమై గురువుగారు ఈ దెబ్బను స్వీకరించిరి అన్న విషయమును శివాజీ గ్రహించి, ఆ చెరుకు తోట యజమానిని సభకు పిలిపించి, గురువుగారు ఎదుట నిలబెట్టి," గురుదేవా! ఇతనికి ఏ శిక్ష విధించమంటారు?" అని అడిగెను.






అందుకు సమర్థరామదాసు శాంతంగా," కుమారా! తప్పు చేసినది నా శిష్యులు. అతడు కాదు కదా.

నా శిష్యులుగా ఉండి, ఇంద్రియ నిగ్రహం లేక, యజమాని అనుమతి లేక చెరుకు గడలను తినుట అపరాధం కాదా!

కనుక నష్ట పరిహారము మనమే అతనికి చెల్లించాలి. దానికై నీవు రాజుగా అతని చెరుకు తోట పై విధించే పన్నును రద్దుచేయి" అన్నాడు.



**చూశారా పిల్లలూ! ఆదర్శ గురువు తన శిష్యులను రక్షించుటకై, తామే స్వయంగా శిక్షను అనుభవించెదరు. అందుకే "గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః" అంటారు.** కనుక పిల్లలూ ఈరోజు నుంచి మనము, ప్రత్యక్షదైవ స్వరూపాలైన తల్లిదండ్రులకు ప్రతిరోజు నిద్ర లేవగానే కాళ్ళకి నమస్కారము పెట్టుకుందాము.

త్రిమూర్తి స్వరూపుడు అయినటువంటి గురువు యందు భక్తిశ్రద్ధలు కలిగి గురుభక్తిని ప్రకటించుకుందాము. గురువు దైవము ఒక్కటే. ప్రాచీన ఋషులు కూడా భగవంతున్నే గురువుగా విశ్వసించేవారు.

మన తల్లి ,తండ్రి ,గురువు, దైవం అయినటువంటి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు కూడా వారి తల్లిదండ్రుల పట్ల ఎంతో ప్రేమానురాగాలను ప్రకటించేవారు. స్వామి యొక్క తల్లి గారైన ఈశ్వరమ్మ గారు కోరిన మూడు చిన్న కోరికలను సమస్త మానవులకు ఉపయోగపడే విధంగా తీర్చారు.




అవి ఏమనగా, స్వామి! మన గ్రామంలో పిల్లలకి పాఠశాల కట్టించండి అని తల్లి కోరగా, ఆమె కోరికమేరకు ఈశ్వరాంబా ప్రాథమిక విద్యాలయం కట్టించారు. ఆ చిన్న పాఠశాల ఇప్పుడు" శ్రీ సత్య సాయి విశ్వవిద్యాలయంగా" రూపొందింది .. స్వామి! మన గ్రామంలోని పిల్లలకు సరైన వైద్య సదుపాయం లేదు, కనక చిన్న వైద్యాలయం కట్టించండి అని కోరగా. కట్టించిన ఆ చిన్న వైద్యాలయము నేడు “శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ “ గా రూపొంది ఎన్నో లక్షల మందికి వైద్య సదుపాయము అందిస్తున్నది.




స్వామి! మన గ్రామంలో ప్రజలు నీటి కొరకై చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి నీటి సదుపాయాన్ని కలిగించండి అని తల్లి అడుగగా. కట్టించిన చిన్న బావి నేడు “శ్రీ సత్య సాయి సుజల స్రవంతిగా" కొన్ని లక్షల మందికి దాహార్తిని తీరుస్తోంది.



**చూశారా పిల్లలూ! స్వామి తన తల్లి కోరిన కోరికలను ఎలా తీర్చారో. మనమందరం కూడా స్వామి బాటలో పయనిస్తూ,మన తల్లిదండ్రులకు ఆనందాన్ని అందిద్దాము !**



సమస్త లోకః సుఖినో భవంతు